

కూష్మాండ రూపంలో వనదుర్గమ్మ

పాపన్నపేట, న్యూస్‌టుడే: ఏడుపాయల వన దుర్గామాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాల్గో రోజు ఆదివారం ఆకుపచ్చ రంగు వస్త్రాలంకరణలో కూష్మాండ దేవి(వనదుర్గా)గా అమ్మవారు దర్శనమిచ్చింది. వరద ప్రవాహం అధికంగా ఉండడంతో అర్చకులు సైతం ఆలయంలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రాజగోపురంలో అమ్మవారికి నిత్య పూజలు కొనసాగాయి. ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. గోకుల్ షెడ్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనదుర్గామాతను సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో చంద్రశేఖర్, అర్చకులు స్వాగతం పలికారు. రాజగోపురంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఈవో


చిలప్‌చెడ్: ప్రత్యేక అలంకరణలో చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ చాముండేశ్వరి మాత

గుచ్చుకునేదాకా.. గుర్తించరా..?



మెదక్, న్యూస్‌టుడే: రోగులకు వినియోగించాల్సిన సిరంజీలను నిర్లక్ష్యంగా పడేశారు. ఇది మెదక్‌లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నెలకొన్న దుస్థితి. జిల్లా కేంద్రం ఏర్పాటుతో జిల్లా వైద్యాధికారి కార్యాలయాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేశారు. ఆయా పీహెచ్‌సీలకు ఔషధాలు, సిరంజీలు నిల్వ కోసం స్టోర్ ఏర్పాటు చేశారు. గత ఏడాది కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు మార్చగా, ప్రస్తుతం స్టోర్ మాత్రమే ఉంది. దీనికి ఎదురుగా ఉన్న భవనంలో పైకి వెళ్లే దారిలో డబ్బాల్లో సిరంజీలు పడి ఉన్నాయి. అందులో పలు మూత తెరిచి ఉండడంతో గుచ్చుకునే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వాటిని తొలగిస్తే ప్రమాదాలకు అవకాశం ఉండదు.

వృత్తి నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన

వెల్దుర్తి: వృత్తి నైపుణ్యాల విద్యను విద్యార్థులకు అలవాటు చేయడమే ధ్యేయంగా సంచికి దూరం కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న 'బ్యాగ్ లెస్ డే' కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులు పతంగుల తయారీ, గోడలపై చిత్రాలు గీయడం, వ్యవసాయంలో సహాయం చేయడం వంటి మెలకువలు నేర్పించారు.

అందుబాటులో ఔషధ గిడ్డంగి

సర్కారు దవాఖానాలకు తీరనున్న ఇక్కట్లు

న్యూస్‌టుడే-మెదక్:

• జిల్లా కేంద్రంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తరచూ వాక్సిన్, ఔషధాల కొరత ఏర్పడుతోంది. దీంతో అక్కడికి వచ్చే ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డిలో ఉన్న కేంద్ర ఔషధ గిడ్డంగి నుంచి సుమారు రెండు నెలలకోసారి ఔషధాలు రావడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. మరికొన్ని పీహెచ్‌సీలోనూ అప్పుడప్పుడు ఈ సమస్య తలెత్తుతోందని పలువురు వాపోతున్నారు.

కేంద్ర ఔషధ గిడ్డంగి ఇన్నాళ్లు ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రం సంగారెడ్డికే పరిమితమైంది. ఫలితంగా పీహెచ్‌సీలకు వివిధ మాత్రలు, ఇతర త్రావి అవసరమైతే కొన్ని సార్లు ఎదురుచూడాల్సి వస్తోంది. త్వరలో ఆ కష్టాలు తీరనున్నాయి. మెదక్‌లో గిడ్డంగి ఏర్పాటుకు ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతానికి మెదక్‌లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పాత జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధం చేశారు. సిబ్బంది నియామకం పూర్తయితే ఏర్పాటు ప్రక్రియ త్వరగా పూర్తవనుంది.


మెదక్‌లో ఏర్పాటైన గిడ్డంగి

ఇక్కడి నుంచే ఔషధాలు, వ్యాక్సిన్లు..

ప్రస్తుతం మెదక్‌లో కేవలం వ్యాక్సిన్, ఎపిడెమిక్‌కు సంబంధించి ఔషధాలు ఆయా ఆసుపత్రులకు సరఫరా చేస్తున్నారు. కేంద్ర ఔషధ గిడ్డంగి ఏర్పాటుతో ఇబ్బందులు తీరనున్నాయి. ఇక్కడి నుంచే జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు సుమారు 400రకాల ఔషధాలు, వ్యాక్సిన్లను చేరవేయనున్నారు. ఇందుకోసం ఒక వాహనం రానుంది. ఇద్దరు ఫార్మాసిస్టులు, ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు ప్యాకర్లు అవసరం. గిడ్డంగి ఏర్పాటుతో ప్రస్తుతం కొన్ని ఔషధాలు మెదక్‌కు చేరుకున్నాయి.

సకాలంలో అందక...

2016లోనే జిల్లాల విభజన జరిగినా ఉమ్మడి జిల్లా కేంద్రం సంగారెడ్డి నుంచే ఔషధాలు సరఫరా అవుతున్నాయి. సంగారెడ్డి నుంచి రెండు వాహనాల్లో మెదక్ జిల్లాకు చేరవేస్తున్నారు. రామాయంపేట మండలం ప్రగతి ధర్మారంలో ఉన్న పీహెచ్‌సీకి ఔషధ వాహనాలు వెళ్లాలంటే 101కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. ఇది వ్యయప్రయాసలతో కూడింది. మరోవైపు కొన్ని పీహెచ్‌సీలకు సకాలంలో మాత్రలు సరఫరా కావడం లేదు. ప్రస్తుతం పీహెచ్‌సీలు అవసరమైన వాటి కోసం ఆన్‌లైన్‌లో ఈ-ఔషధి ద్వారా ఇండెంట్ పెడుతున్నారు. నిర్దేశిత పీహెచ్‌సీల మార్గంలో రెండు మూడు కేంద్రాలు ఉంటే ఆయా వాటిని గిడ్డంగి నుంచి సరఫరా చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో అత్యవసరంలో జాప్యం నెలకుంటోంది. కొన్ని కేంద్రాలకు మూడు నెలలకోసారి చేరుతున్నాయి. జనరల్ మెడిసిన్, ఐవీ ఫ్లూయిడ్స్, ఇంజెక్షన్లు.. సంగారెడ్డి నుంచి జిల్లాలోని వైద్యశాలలకు చేరవేస్తున్నారు. జనాభాకు అనుగుణంగా కనిష్ఠంగా ఒక పీహెచ్‌సీకి నెలకు సుమారు రూ.లక్ష విలువైన ఔషధాలు అవసరమవుతాయనేది అధికారుల అంచనా.

జిల్లాలో ఇలా....
పీహెచ్‌సీలు: 19
అర్బన్ పీహెచ్‌సీ: 1
ప్రాంతీయ ఆసుపత్రి:1
సామాజిక ఆసుపత్రులు:3
జిల్లా ఆసుపత్రి:1

రెట్టింపు ధరలు..

పదిహేను రోజుల్లోనే పెరిగిన కూరగాయల ఖర్చు



న్యూస్‌టుడే, చేగుంట, మెదక్ టౌన్: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ముఖ్యంగా టమాటా ధర రోజురోజుకు ఆకాశాన్ని అంటుతోంది. 15 రోజుల క్రితం వరకు కిలో రూ.20 వరకు ఉండగా.. ఇప్పుడు ఏకంగా సంతలో కిలోకు రూ.80వరకు చేరింది. దీంతో సామాన్యులు టమాటా అంటేనే భయపడి పోతున్నారు. గత ఏడాది కూడా కిలో రూ.100 దాటింది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే వస్తుందని ప్రజలు భయపడుతున్నారు.

దిగుబడి తగ్గి..

పదిహేను రోజుల వ్యవధిలోనే ధరలు భారీగా పెరిగాయి. గ్రామాల్లో పంటల సాగు తగ్గిపోయింది. గత నెలలో భారీ వర్షాలు కురవడంతో చాలా చోట్ల టమాటా పంట దెబ్బతిన్నది. దీంతో ఇప్పుడు ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం భారీ వర్షాలు కురిస్తే టమాటా పంటకు నష్టం వాటిల్లుతుంది. జిల్లాలో చేగుంట, చిన్నశంకరంపేట, మాసాయిపేట, వెల్దుర్తి, మెదక్, రామాయంపేట, నిజాంపేట, శివ్వంపేట, నర్సాపూర్ తదితర మండలాల్లో చాలా మంది రైతులు టమాటా సాగు చేస్తుంటారు. పంట మంచిగా ఉన్న సమయంలో అకాల వర్షాల వల్ల దెబ్బతినడంతో రైతులకు కూడా నష్టం జరిగింది. దిగుబడులు తగ్గి ధర పెరిగిపోయింది. ప్రస్తుతం జిల్లాలో వివిధ రకాల కూరగాయల పంటల సాగు 1900 ఎకరాల్లో ఉంది.

ఇతర వాటి పరిస్థితి అంతే

టమాటాతో పాటు ఇతర కూరగాయల పరిస్థితి అంతే ఉంది. ప్రతి కూరగాయ ధర పెరగడంతో ప్రజలు భయపడుతున్నారు. సంత రోజు కూరగాయలు కొనేందుకు వెళ్తితే రూ.500 ఖర్చు అవుతున్నాయి. వారానికి ఇంత ఖర్చయితే ఎలా అని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిస్తే రైతులు కూరగాయల కంటే వరి, మొక్కజొన్న, పత్తి పంటలను ఎక్కువగా సాగు చేస్తుంటారు. పంట తక్కువగా ఉండటం వల్ల ధర పెరిగిపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే ఆకుకూరల ధర కూడా పెరిగిపోయింది. రూ.20 ఇస్తే నాలుగు కట్టలు ఇస్తున్నారు. అలాగే రూ.10 చెల్లిస్తేనే కొత్తిమీర కట్ట ఇస్తున్నారు.

కూరగాయల ధరలు (కిలో/రూ.లలో)

కూరగాయ	గత నెలలో..	ప్రస్తుతం
టమాటా	20	80
గోరుచిక్కుడు	40	80
పచ్చిమిరప	40	60
బెండకాయ	40	60
వంకాయ	40	80
కాకర	40	80
ఆలుగడ్డ	30	50
బీర	40	80

దేశాన్ని విశ్వగురువుగా నిలపడమే లక్ష్యం: ఆర్‌ఎస్‌ఎస్


మెదక్‌లో ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకుల పథ సంచాలక్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: దేశాన్ని విశ్వగురువు స్థానంలో నిలపాలన్నదే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని క్షేత్ర కార్యకారిణి సభ్యుడు బూర్ల దక్షిణామూర్తి అన్నారు. ఆదివారం మెదక్‌లోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి మహోత్సవం, ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సమాజంలో దేశభక్తి పెంపొందించి, పటిష్ఠ దేశంగా మార్చడమే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తోందన్నారు. కేరళలో వరదలు వచ్చినప్పుడు వేల మంది స్వయం సేవకులు సహాయం అందించారని గుర్తు చేశారు. అంతకు ముందు స్వయం సేవకులు పట్టణ పురవీధుల మీదుగా పథ సంచాలక్ నిర్వహించారు. నగర సంఘ చాలక్ డా.భానుచందర్, ముఖ్య అతిథి డాక్టర్ తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న దక్షిణామూర్తి

రహదారి దాటేప్పుడు.. జర భద్రం



మండల కేంద్రమైన నార్సింగి మధ్య నుంచి 44వ జాతీయ రహదారి వెళ్తుతోంది. గ్రామం ఒక వైపు, మరో వైపు నర్సంపల్లి, పెద్దతండా గ్రామాలున్నాయి. పీహెచ్‌సీ, పోలీసుస్టేషన్, తహసీల్ కార్యాలయం, ఎంపీడీవో, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, వ్యవసాయశాఖ కార్యాలయాలు మరో వైపు ఉన్నాయి. గ్రామస్థులు అటూ. ఇటూ వెళ్లేందుకు వంతెన నిర్మించినా, దూరంగా ఉందని అందరూ రహదారిని దాటి వెళ్తుంటారు. గతంలో ఇలా దాటుతూ పలువురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నార్సింగి (చేగుంట)

మహిళలకు బతుకమ్మ చీరలేవీ?: ఎమ్మెల్యే


కౌడిపల్లిలో దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, న్యూస్‌టుడే: బతుకమ్మ చీరలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడినట్లేనని ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. నర్సాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం ఒక చీర ఇస్తే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు ఇస్తుందని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. బతుకమ్మ పండగ వచ్చినా ఆ మాటే ఎత్తడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలంటే గౌరవం లేదని దుయ్యబట్టారు. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, న్యూట్రిషన్, కేసీఆర్ కిట్లు ఏమయ్యాయని నిలదీశారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.లక్ష నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని మాటిచ్చి తప్పారని దుయ్యబట్టారు. మహిళకు రూ.2500ల నగదు ఇస్తామని హామీ ఇచ్చినా అమలుచేయడం లేదని ఆరోపించారు. నర్సాపూర్‌లో 400 వరకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీకి సిద్ధంగా ఉన్నా కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. సోమవారం లోగా పంపిణీ చేయకుంటే ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తానని అన్నారు. జడ్పీ కో-ఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, బల్దియా ఉపాధ్యక్షుడు నయీమోద్దీన్, నాయకులు సత్యంగౌడ్, షేక్‌హుస్సేన్, నర్సింహులు, మహ్మద్, యాదాగౌడ్ తదితరులున్నారు.

కౌడిపల్లి, శివ్వంపేట: కౌడిపల్లిలోని హనుమాన్ ఆలయం వద్ద దుర్గాభవాని యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో భవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, నేతలు పబ్బ మహేష్ గుప్తా, చంద్రాగౌడ్, మన్సూర్, గోడ రాజేందర్, బుచ్చేశ్ యాదవ్, పాపగారి రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

తామరపువ్వుల కనువిందు



పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: మండలంలోని బుజ్రాన్‌పల్లి వద్ద ఉన్న చెరువులో పెరిగిన తామర పూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. గత కొన్ని రోజులుగా వచ్చిన నీటిలో తామర తీగ చెరువులో పెరిగింది. పూసిన కమలాలు కనువిందు చేస్తున్నాయి.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా సుహాసినిరెడ్డి



నర్సాపూర్, కౌడిపల్లి: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా కౌడిపల్లికి చెందిన చిలుముల సుహాసినిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. నర్సాపూర్ నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్టు నాయకుడు చిలుముల విఠల్‌రెడ్డి కోడలే సుహాసినిరెడ్డి. ఆమె భర్త కిషన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. 2001-2009వరకు ఆమె భారాస మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేశారు. 2023అసెంబ్లీ ఎన్నికలకు ముందు భారాసను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. గ్రంథాలయాలను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని సుహాసినిరెడ్డి తెలిపారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి: డీబీఎఫ్


బాధిత కుటుంబం నుంచి వివరాలు సేకరిస్తున్న శంకర్

రామాయంపేట: మంత్రాల నెపంతో దళిత మహిళ సజీవ దహనం ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, జైలు నుంచి వచ్చిన తర్వాత బాధిత కుటుంబాన్ని చంపేస్తామని నిందితులు బహిరంగంగానే బెదిరించినందున వారికి బెయిల్ ఇవ్వవద్దని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ కోరారు. ఆదివారం ఆయన రామాయంపేట మండల పరిధి కాట్రియాలలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల తరహాలో తెలంగాణ ప్రభుత్వం మూఢనమ్మకాల నిర్మూలన చట్టం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు సంజీవ్ కార్యదర్శి దయాసాగర్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయండి: ఎమ్మార్పీఎస్

మెదక్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తానని, ఈ విషయంలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ ప్రభుత్వం ముందుంటుందని అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మాదిగలను నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో అర్హులైన నిరుద్యోగులు నష్టపోతున్నారని వాపోయారు.

బదిలీలపై వీడని చిక్కుముడి

తూప్రాన్ విద్యుత్తు డివిజన్ పరిధిలో అంతర్గత కుమ్ములాటలు

న్యూస్‌టుడే, తూప్రాన్, చేగుంట:

విద్యుత్తు శాఖలో ఒకే చోట రెండేళ్లకు పైబడిన లైన్‌మెన్లు, లైన్‌ఇన్‌స్పెక్టర్లను బదిలీలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తూప్రాన్ డివిజన్‌లో మాత్రం రెండు సంఘాల అధిపత్య పోరులో బదిలీల్లో తీవ్ర జాప్యమవుతోంది. సోమవారం బదిలీలకు చివరి రోజు కావడంతో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై తీవ్ర చర్చనడుస్తోంది.


తూప్రాన్ విద్యుత్ డీఈ కార్యాలయం

రెండేళ్లు దాటితే..

తూప్రాన్ విద్యుత్తు డివిజన్ పరిధిలో తూప్రాన్, మనోహరాబాద్, మాసాయిపేట, వెల్దుర్తి, శివ్వంపేట, చేగుంట, రామాయంపేట, నార్సింగి, నిజాంపేట, వెల్దుర్తి, శివ్వంపేట మండలాలున్నాయి. వీటి పరిధిలో 15 మంది లైన్‌మెన్లు, 8 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తున్నారు. వీరిలో లైన్‌ఇన్‌స్పెక్టర్ గరిష్ఠంగా 6 సంవత్సరాలు, లైన్‌మెన్ గరిష్ఠంగా 4 ఏళ్లుగా ఒకే చోట ఉంటున్నారు. మిగతా వారు 3, 2 సంవత్సరాలకు పైగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండేళ్లు దాటితే వేరేచోటకు బదిలీ చేయాల్సి ఉంది. తూప్రాన్ డివిజన్‌లో బదిలీలు కాకపోవడంతో ప్రాధాన్యం లేని చోట విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అధికారులపై సంఘాల ద్వారా ఒత్తిడి చేస్తున్నారు.

ఆదాయం ఎక్కువ వస్తుందని..

తూప్రాన్ డివిజన్‌లో మనోహరాబాద్ మండలంలో అత్యధిక పరిశ్రమలు ఉండడం, అభివృద్ధి ఎక్కువగా జరుగుతుండటం, ఆదాయం ఎక్కువ వస్తుందని ఉద్యోగులు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రామాయంపేట మండలంలో చేసే ఉద్యోగులు తూప్రాన్, మనోహరాబాద్ వైపు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ తూప్రాన్, మనోహరాబాద్ మండలంలో పని చేస్తున్న ఉద్యోగులు అటు వెళ్లేందుకు నిరాకరిస్తుండడంతో సమస్య తీవ్రమవుతోంది. సోమవారం అధికారులు తీసుకునే నిర్ణయంపైనే బదిలీ అంశం కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

ఫలించని చర్చలు

ఈ బదిలీల అంశం బహిరంగంగా పైస్థాయిలో చర్చకు దారి తీయడంతో ఉన్నతాధికారులు రెండు సంఘాల నాయకులతో శనివారం చర్చలు జరిపారు. రెండేళ్లకు పైబడిన వారు చర్చించుకొని ఎవరు ఎక్కడికి బదిలీ అవుతారో నిర్ణయించుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. కానీ వారిలో సయోధ్య కుదరకపోవడంతో ఇంకా బదిలీ అంశం కొలిక్కిరాలేదని తెలిసింది. సమస్య పరిష్కారం కాకపోతే బదిలీ చేసిన చోటుకు వెళ్లాలని తేల్చిచెప్పారు. సోమవారమే ఉత్తర్వులకు చివరిరోజు కావడంతో ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

నిబంధనల మేరకు..

–రాజేందర్, విద్యుత్ డీఈ తూప్రాన్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం తూప్రాన్ విద్యుత్తు డివిజన్ పరిధిలో ఉద్యోగుల బదిలీలు చేస్తాం. ప్రస్తుతం సీనియారిటీ జాబితాను సిద్ధం చేశాం. రెండేళ్లకు పైగా ఉంటున్న వారిని బదిలీలు చేసి సోమవారం ఉత్తర్వులు అందజేస్తాం. ఈ విషయంలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటాం.

కోతులను బంధించి.. అడవికి తరలించి..


కోతులను వాహనంలో తరలిస్తున్న నవీన్ గుప్తా, గ్రామస్థులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో కోతుల దాడులు పెరుగుతున్నాయి. పొలాలపై దాడి చేసి పంటలను, పెంకుటిల్లను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో ఇళ్ల ఆవరణలో, పొలాల గట్లపై పెంచుకున్న చెట్లను గ్రామస్థులు పూర్తిగా నరికేశారు. కూరగాయలు పండించకుండా పొలాలను బీడు పెట్టారు. కోతుల బెడద నుంచి బయటపడేందుకు శివ్వంపేటలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా రూ.2.50 లక్షలతో కోతులను బంధించే ప్రత్యేక వాహనాన్ని తయారు చేయించారు. రోజు బోనులో పడిన వాటిని పీఎంజీ యువసేన సభ్యులు, గ్రామస్థుల సహకారంతో అడవి ప్రాంతంలోకి తీసుకువెళ్లి విడిచిపెడుతున్నారు.

ప్రకృతి ఆరాధనే.. బతుకమ్మ..

బతుకమ్మ పూల పండగ.. ప్రకృతిని ఆరాధించే వేడుక.. మనుషుల మధ్య బంధాన్ని పెంచడంతో పాటు అందరి బతుకును కోరుతుంది. ఇదే బతుకమ్మ పరమార్థం. ఇందులో ఉండే విశేషాలు, పాటల్లో ఉండే అంశాలు ప్రజలకు తెలియజెప్పే లక్ష్యంతో పలువురు దీనిపై అధ్యయనం చేశారు. ఆయా విశేషాలు ఇలా..

- న్యూస్‌టుడే, సిద్దిపేట, చేర్యాల

28 ఏళ్లుగా పరిశోధన..



పాడి పంటలు, పర్యావరణంతో ముడిపడిన పండగ బతుకమ్మ అని అంటారు సిద్దిపేట స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు సహ ఆచార్యులు డా. మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి. స్వస్థలం కరీంనగర్. 2022లో ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా ప్రస్థానం మొదలైంది. తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి అంటే అమితాసక్తి. 2014లో తెలంగాణ కథా సాహిత్యం- స్థానికతపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1996లో బతుకమ్మ, జానపద పాటలపై పరిశోధన ఆరంభించారు. 28 ఏళ్లలో 60కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. 200కి పైగా బతుకమ్మ పాటల్లోని అంశాలను అధ్యయనం చేసి ఎన్నో విషయాలు వెల్లడించారు. వ్యవసాయం, ఆడబిడ్డ, పర్యావరణం, చరిత్ర, స్త్రీ పురుష సంబంధాలు, మానవీయ, ప్రకృతి, జీవకోటి, ఆహారం అటవీ, జల వనరుల అంశాల్లో ముడిపడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల గంగ దర్వాజ పేరిట పుస్తకం వెలువరించారు. బతుకమ్మ పాటల పుస్తకం ఆవిష్కరణకు సిద్ధమయ్యారు.

పండగ అంతరార్థం ఇది..:


సృష్టిలో ఏ ప్రాణికైనా సంతానోత్పత్తి ప్రథమ ఆశయం. పూలు పరపరాగ సంపర్కం జరిపి ప్రతి సృష్టికి సిద్ధమైన తరుణంలో తెలంగాణ సమాజం పూలకు జరిపే పండుగే బతుకమ్మ. సమస్త జీవకోటికి అనుసంధానించే వేడుకగా అభివర్ణించవచ్చు. బొడ్డెమ్మ.. ఎదుగుతున్న స్త్రీకి సంకేతం. బతుకమ్మ.. ఎదిగి పెళ్లి పేరంటం చేసుకున్న స్థితికి సంకేతం. **డా. మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి**

గుర్తించారిలా..

● ఈ పండుగ.. స్త్రీ తత్వం గొప్పతనాన్ని చాటుతుంది. మనిషికి, ప్రకృతికి ఉండే అవినాభావ సంబంధాన్ని చెబుతుంది. ఆడబిడ్డకు, పుట్టినింటికి ఉండే రక్త సంబంధాన్ని వివరిస్తుంది. తెలంగాణ సమాజం వందల ఏళ్లుగా పర్యావరణ విలువలను కాపాడేందుకు చేస్తున్న గొప్ప ప్రయత్నం.

● నిరాడంబరత్వం, ప్రకృతిని కొలిచే విధానం ప్రస్ఫుటమవుతోంది. ప్రతి ఊర్లోనూ పండగను ఉమ్మడిగా చేసుకోవడం నాటి నుంచి అలవర్చుకోవడం విశేషం.

బహుళ ప్రాచుర్యంతోనే..



శాస్త్రీయంగానే కాకుండా మానవ సంబంధాలతో పెనవేసుకున్న బతుకమ్మ విశేషాలను అందరికీ తెలిసేలా ప్రాచుర్యం కల్పించాలని అంటున్నారు చేర్యాల మండలం ఆకునూరుకు చెందిన విష్ణుమూర్తి. కాకతీయ విశ్వ విద్యాలయంలో 'బతుకమ్మ పండుగ పాటలు (సంస్కృతి సంప్రదాయాలు)'పై పరిశోధన చేసి పుస్తకం వెలువరించారు. ఉపాధ్యాయుడిగా పని చేసి రెండేళ్ల కిందట పదవి విరమణ పొందారు.

పల్లె స్ఫూర్తితో ఆటా పాటలపై..

విష్ణుమూర్తిది పల్లె నేపథ్యం కావడంతో పండగలపై ఆసక్తి పెరిగింది. ప్రధానంగా ఊరంతా కలిసి చేసుకునే బతుకమ్మ గురించి తెలుసుకోవాలన్న ఉత్సుకత చూపారు. అదే దానిపై అధ్యయనం చేసేలా చేసింది. ఏయే ప్రాంతాల్లో ఈ పండగల ఎలా చేసుకుంటారో తెలుసుకున్నారు. ఆటాపాటలపై పరిశోధన చేశారు. బతుకమ్మ పండగ పూర్వ వైభవానికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని గుర్తించారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి, ఊరూరా వేదికలు ఏర్పాటు చేయడంతో పాటు ఇంకేం చేయాలో తన పుస్తకంలో పొందుపరిచారు.

మరెన్నో విషయాలు

జానపద సాహిత్యం మొదలుకొని బతుకమ్మ పండగ స్వరూప స్వభావాలు, పాటల వర్గీకరణతో పాటు సంస్కృతి, సంప్రదాయం తదితర అంశాలను పుస్తకంలో వివరించారు. వ్యవసాయానికి స్త్రీ, పురుష సంబంధాలు- సాంఘిక జీవనం, జానపదుల నమ్మకాలు, దుస్తులు, ఆభరణాలు, ఆహారం, ఆటలు, వినయం వంటి వెన్నో ఉన్నాయి. పండగ పాటలు, సంగీత నృత్య విశేషాలు, భాషావిశేషాలనూ క్షుణ్నంగా విపులీకరించారు. మహిళలు పాడే పాటల్లోని చంధస్సు, అలంకారాలు, సామెతలు, జాతీయాలు, నుడికారాలు, వర్ణాలు, వర్ణవ్యత్యయం, ప్రత్యాయాలు, నవ్యకల్పన, ఇష్ట దేవతాస్తుతి, మాండలికాలు ఇలాంటి విషయాలను పుస్తకంలో విశ్లేషించారు.



కాలినడకన కదిలి.. అమ్మను దర్శించి



భవానీమాత ఆలయం

దేశవ్యాప్తంగా దసరా సంబరాలు మొదలయ్యాయి. మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాత ఆలయంలో జరిగే ఉత్సవాలు తనివితీరా చూసి తీరాల్సిందే. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు, నర్సాపూర్, వికారాబాద్ జిల్లా తాండూరు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులెంతో మంది అమ్మను ఇలవేల్పుగా కొలుస్తుంటారు. దసరా సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి కాలినడకన ఆలయానికి వెళ్లి అమ్మను దర్శించుకొని మొక్కు చెల్లించుకుంటుంటారు. ఈసారి జాతరకు సైతం భారీగా ప్రజలు బృందాలుగా నడుచుకుంటూ ఆలయం బాట పట్టారు. వారంతా 65వ నంబరు జాతీయ రహదారిపై జహీరాబాద్ మీదుగా తుల్జాపూర్‌కు వెళ్తుంటారు. మూడు రోజులుగా ఆ రోడ్డంతా కిటకిటలాడుతోంది. దసరా మరుసటి రోజు వరకు ఈ సందడి కనిపిస్తుంది.

అత్యధికులు..

దసరా సందర్భంగా దుర్గమ్మ మండపాలు, ఇళ్లల్లో ప్రతిష్ఠించుకొని పూజించడం ఆనవాయితీ. జహీరాబాద్‌కు 180 కి.మీ. దూరంలో ఉన్న తుల్జాపూర్ భవానీమాతను దర్శించుకోవడం పవిత్రంగా భావిస్తారు. అత్యధికులు కాలినడకకే ప్రాధాన్యం ఇస్తారు. కొందరు మిత్రులతో కలిసి బృందంగా వెళ్తుంటారు.

అన్నదాన శిబిరాలు..

జహీరాబాద్‌కు చెందిన పలువురు భక్తుల కోసం అన్నదాన శిబిరాలు ఏర్పాటుచేస్తూ తమవంతు సహకారం అందిస్తున్నారు. జహీరాబాద్- తుల్జాపూర్ మధ్యలో 100కు పైగా శిబిరాలు వెలిశాయి. వీటిలో జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలకు చెందిన వారికే సగం వరకు ఉన్నాయి.

- న్యూస్‌టుడే, జహీరాబాద్

శరన్నవరాత్రి ఉత్సవాల్లో సామాజిక చైతన్యం



దుబ్బాక పట్టణంలోని 20వ వార్డులో యువకిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సభ్యులు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సామాజిక చైతన్యంపై దృష్టి సారించారు. నేడు సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ, 'మత్తు వదలరా' పేరిట భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వీరు గతంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సైబర్ నేరాలు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగించడం గమనార్హం.

- న్యూస్‌టుడే, దుబ్బాక

నాట్యమయూరి.. నివేదిత



ఓ వైపు నృత్యం.. మరోవైపు నటనలో రాణించడంతో పాటు చదువులో ముందంజలో ఉంటోంది ఈ బాలిక. అందరి మన్ననలు పొందుతున్న ఆ బాలికే సంగారెడ్డి జిల్లా కంగ్టికి చెందిన 12 ఏళ్ల నివేదిత. తల్లిదండ్రులు వర్ధలత, దత్తాత్రి. తండ్రి రైల్వే ఉద్యోగి కాగా, తల్లి గృహిణి. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. తల్లిదండ్రులకు కూచిపూడిపై ఉన్న ఆసక్తితో కుమార్తెను ప్రోత్సహించారు. నాలుగేళ్ల వయసులోనే నివేదిత గురువు శ్రీనివాస్‌వరప్రసాద్ వద్ద ఓనమాలు నేర్చుకున్నారు. ఐదేళ్ల వయసు నుంచి ప్రదర్శన ఇవ్వడం మొదలుపెట్టారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో 250కి పైగా ప్రదర్శనలు ఇవ్వడం విశేషం.

సంకల్పంతో సాధన

నివేదిత గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయంలో 7వ తరగతి చదువుతోంది. నిత్యం ఉదయం 5 గంటలకు సాధన చేస్తారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణకు వెళ్తున్నారు. నృత్యం, మోనో యాక్షన్‌లో ఏకకాలంలో రాణిస్తున్నారు. నాలుగేళ్ల కిందట తానా ఆధ్వర్యంలో నిర్వహించిన మోనో యాక్షన్ ఆన్‌లైన్ పోటీలో రాణిరుద్రమదేవిగా అభినయించి తొలి స్థానంలో నిలిచారు. ఈ పోటీలో 40 దేశాలకు చెందిన 680 మంది కళాకారులు పాల్గొన్నారు. నృత్యకళా బాలప్రతిభా మహోత్సవ్, భారత రంగస్థల, అఖిలనటరాజన్, అంతర సాంస్కృతిక సంస్థాన్, భారతీయ నృత్య సమ్మేళన్, సంస్కారభారతి, రాష్ట్రీయ కళామహోత్సవ్ తదితర అకాడమీలు నిర్వహించిన పోటీల్లో ప్రతిభచాటి బహుమతులు అందుకున్నారు. ఇటీవల మహానంది, బాలకళాశ్రీ నృత్య పురస్కారాలు అందుకున్నారు. 2024-25కు గాను బాల పురస్కారానికి నామినేషన్ వేశారు.

- న్యూస్‌టుడే, నారాయణఖేడ్, కంగ్టి

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

జిన్నారం, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం శివారులో ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.... విశాఖ జిల్లా అనకాపల్లికి చెందిన వీర్రాజు కుటుంబ సభ్యులతో 20 ఏళ్లుగా గడ్డపోతారంలో నివసిస్తూ.. స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి గడ్డపోతారం శివారు నుంచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ద్విచక్ర వాహనదారుడికీ తీవ్ర గాయాలవడంతో స్థానికులు సూరారంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్రాజుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఐడీఏ బొల్లారం పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..



వెంకటి

రామాయంపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేటకు చెందిన ముత్యం వెంకటి(38) రామాయంపేట పట్టణంలోని ఓ దుకాణంలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలోనే రామాయంపేట నుంచి ద్విచక్ర వాహనంపై అక్కన్నపేటకు వస్తున్నాడు. గ్రామ శివారులోని పకీరు సాబ్ గుట్ట వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి ఎల్లవ్వ ఆయనపైనే ఆధారపడి జీవిస్తోంది.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు



రవీందర్

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: గుండెపోటుతో తాండూరు పట్టణంలోని షావుకార్‌పేట్‌కు చెందిన కానిస్టేబుల్ కావలి రవీందర్(38) మృతి చెందాడు. పెద్దేముల్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఎప్పటిలాగే శనివారం విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చారు. రాత్రికి భోజనం చేసి పడుకున్నారు. ఉదయం ఎంతకు నిద్ర లేవకపోవడంతో భార్య మహేశ్వరి స్థానికులను పిలవడంతో వారు వచ్చి అతడిని లేపే ప్రయత్నం చేశారు. లేవకపోవటంతో వెంటనే 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు. రవీందర్‌కు ఎనిమిదేళ్ల కూతురు శ్రావ్య, నాలుగేళ్ల కొడుకు అభిరాం ఉన్నాడు. పట్టణంలోని గొల్లచెరువు శ్మశానవాటికలో ఆదివారం సాయంత్రం పోలీసులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. విగతజీవిగా లభ్యమై..



నర్సయ్య

చేగుంట, న్యూస్‌టుడే: అదృశ్యమైన వృద్ధుడు మృతిచెందిన ఘటన చేగుంట మండలం మక్కరాజుపేటలో జరిగింది. స్థానిక ఎస్సై చైతన్య రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నర్సయ్య(69) గత నెల 14న సాయంత్రం పొలం సమీపంలో ఉన్న పశువుల కొట్టం వద్దకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం పొలం సమీపంలో ఉన్న కుంటలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం ఉందని రైతులు గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. విషయాన్ని కుటుంబీకులకు తెలపడంతో అక్కడికి వెళ్లి చూశారు. అదే రోజు ఇంటికి వచ్చే క్రమంలో కుంటలో జారిపడి.. మృతిచెంది ఉంటాడని తెలిపారు. కుటుంబసభ్యులు అంతటా వెతికినా.. కుంట వైపు వెళ్లకపోవటంతో ఆచూకీ లభించలేదన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 114-00	డ్రెస్డ్ 197-00	
రిటైల్ 136-00	స్కిన్‌లెస్ 224-00	

కుటుంబ కలహాలతో బలవన్మరణం

తూప్రాన్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూర్‌కు చెందిన శ్రీశైలం(45) కొంతకాలంగా కుటుంబంతో కలిసి తూప్రాన్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కుటుంబంలో గొడవ జరగడంతో శనివారం అర్ధరాత్రి దాటాక ఓ గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం తెలియజేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మరొకరు..



కుమార్

నిజాంపేట, రామాయంపేట: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేట మండల పరిధి నార్లాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిరుదొడ్డి కుమార్(41) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తన కుటుంబ బాగోగులు సరిగా చూసుకోలేకపోతున్నానని మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో నుంచి వెళ్లిన కుమార్ గ్రామ శివారులోని పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం స్థానికులు గమనించడంతో విషయం వెలుగు చూసింది. భార్య మంజుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

సింగపూర్‌లో తీరొక్క పూలు.. పాటల హోరు



చేగుంట, న్యూస్‌టుడే: సింగపూర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. అక్కడి తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేలాదిగా పాల్గొన్నట్లు చేగుంట మండలం రుక్మాపూర్‌కు చెందిన టీసీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి బసికె ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన తల్లిదండ్రులు సైతం సింగపూర్‌కు వెళ్లారు. తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి మూడు గంటల పాటు పాటలు పాడుతూ ఆడారు. చిన్నపిల్లలు, యువతులు, మహిళలు ఆనందోత్సవాల మధ్య పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

పట్టుదలతో సాగితే విజయం ఖాయం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పట్టుదలతో, శిక్షకుల సహకారంతో ముందుకు సాగితే విజయం ఖాయమని మెదక్ పురపాలిక అధ్యక్షుడు చంద్రపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. పోటీల పరిశీలకులు ఆదర్శ్ మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటలపై దృష్టి సారించాలన్నారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్, తదితరులు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 ఉమ్మడి జిల్లాల నుంచి 180 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల దక్షిణ కొరియాలోని సియోల్‌లో నిర్వహించిన స్లమ్ సాకర్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో దేశం తరపున పాల్గొన్న మెదక్ క్రీడాకారిణి కావేరికి.. చంద్రపాల్ టోపీ, బ్యాగ్ అందించి అభినందించారు. సమన్వయకర్త నాగరాజు, పీడీలు మాధవరెడ్డి, రాజేందర్, మహిపాల్, ప్రతాప్ సింగ్, రవి, సత్యం, మాలతి, లతీఫ్ తదితరులున్నారు.

● మెదక్ జట్టు నిజామాబాద్, హైదరాబాద్ జట్లతో రెండు మ్యాచ్‌ల్లో పోటీ పడగా మెదక్ విజయం సాధించింది. దీంతో సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకుంది. ● ఖమ్మం-నిజామాబాద్ జట్ల మధ్య పోటీలో నిజామాబాద్, కరీంనగర్-నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో నల్గొండ విజయాలు సాధించాయి. రంగారెడ్డి - నల్గొండ జట్ల మధ్య పోటీ టై అయింది.



జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న మెదక్ మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, రమేశ్, ఆదర్శ్, పీడీలు



క్రీడా ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారిణులు


ప్రార్థనాలయం.. భక్తి పారవశ్యం



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తిపారవశ్యంతో కరుణామయుడి ప్రార్థనలు కొనసాగాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వాసులతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు తరలివచ్చారు. ఏసయ్యను దర్శించుకొని ప్రార్థనలుచేపట్టారు. భక్తులు, పర్యాటకులతో మహాదేవాలయం సందడిగా మారింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనామందిరంలో ప్రతిష్ఠించి ఆరాధనలు చేపట్టారు. మెదక్ ప్రెసిబిటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, గురువు రిచర్డ్ దైవసందేశం వినిపించారు. భక్త బృందాలు ఆలపించిన పాటలు అలరించాయి. గురువులు జైపాల్, శ్రీనివాస్, చర్చి కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానంలో పాల్గొన్న మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేట సర్వజన ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛందంగా 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి శ్రావణి, అసోసియేషన్ అధ్యక్షుడు గందె సంతోష్‌కుమార్ మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. మూడునెలకోసారి రక్తం ఇస్తే చెడు రక్తం పోయి మంచి రక్తం తయారవుతుందన్నారు. రక్తదానం చేస్తే అనారోగ్యానికి గురవుతామన్నది కేవలం అపోహ మాత్రమేనన్నారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసిన అసోసియేషన్ ప్రతినిధులను రక్తనిధి కేంద్రం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, రక్తనిధి కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధి.. ఉపాధికి పెన్నిధి

మెదక్ జిల్లాలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటుకు అడుగులు

న్యూస్‌టుడే, తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి

పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అనువైన చోట మరిన్ని భూములు సేకరించి యువతకు ఉపాధి ఇచ్చేలా ప్రణాళిక రూపొందిస్తోంది. మెదక్ జిల్లా తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో 150కి పైగా భారీ, మధ్య చిన్నతరహా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే కొత్తగా మనోహరాబాద్ మండలం పరికిబండ శివారులో 350 ఎకరాలకు పైగా సేకరించి అక్కడ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే ఇక్కడి యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంది.

పరికిబండ శివారులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో లాజిక్టిక్స్ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి తాజాగా ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఇక్కడ 72 ఎకరాల భూమిని గుర్తించారు. దీని దస్త్రాలు సిద్ధం చేసి టీఎస్ఐఐసీ అధికారులకు అప్పగించేందుకు కసరత్తు జరుగుతోంది. ఇక్కడ లాజిక్టిక్స్ పరిశ్రమ ఏర్పాటైతే 3 వేల మందికి పైగా ఉపాధి లభించే అవకాశం ఉంది.

డ్రై పోర్టు..

లాజిస్టిక్ పార్కులో డ్రై పోర్టు నిర్మించనున్నారు. ఇక్కడి నుంచి రోడ్డు, రైలు, విమాన, సముద్రమార్గాల ద్వారా వస్తువుల ఎగుమతికి వీలుగా దీన్ని ఏర్పాటుచేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించనున్నాయి. డ్రైపోర్టు నిర్మాణంతో పర్యావరణానికి ఎలాంటి ఉందు. గోదాములు నిర్మిస్తారు.

234 ఎకరాలు..

పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో 234 ఎకరాలను సేకరించారు. సాగులో ఉన్న రైతులకు ఎకరాకు రూ.19 లక్షలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూములకు రూ.12.5 లక్షల చొప్పున మొత్తం రూ.42 కోట్లు పరిహారం అందజేశారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం పరికిబండ శివారులోనే 611, 209 సర్వే నంబరు మధ్యలో 72 ఎకరాలలో లాజిక్టిక్స్ పార్కు ఏర్పాటు కానుంది. సమీపంలో సేకరించనున్న 44 ఎకరాలు సేకరించనున్నారు.



పరికిబండ శివారులో టీఎస్ఐఐసీకి అప్పగించనున్న భూమి

మరికొన్ని చోట్ల

జిల్లాలోని మాసాయిపేట మండలం అచ్చంపేట, హకీంపేట, రామంతాపూర్ శివారులో 912 ఎకరాల అసైన్డ్ భూమిని, మనోహరాబాద్ మండలం పోతారం శివారులో 200కు పైగా ఎకరాలను సేకరించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. గురువారం జరిగిన సమీక్షలో సంబంధిత అధికారులు వివరాలు సేకరించారు. తూప్రాన్ మండలం ఘనపూర్‌లో ఇప్పటికే భూసేకరణ పూర్తయింది.

నిరుద్యోగులకు మేలు: శ్రీరామ్, పరికిబండ



లాజిస్టిక్ పార్కు, ఇతర పరిశ్రమలు ఏర్పాటైతే నిరుద్యోగులకు మేలు. ఉద్యోగాలకు దూరం వెళ్లే బాధ తప్పుతుంది. ఇక్కడ నిర్మించే పరిశ్రమల్లో స్థానికులకు పెద్దపీట వేయాలి. అధికారులు త్వరగా పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టాలి.

భూ సేకరణ పూర్తి: జయచంద్రారెడ్డి, తూప్రాన్ ఆర్డీవో



పరికిబండ శివారులో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు నిర్మాణానికి భూ సేకరణ పూర్తి చేశాం. మెదక్ జిల్లాలో రైల్వే లైను, కొత్తగా రీజనల్ రింగు రోడ్డు రానున్న నేపథ్యంలో ఇక్కడ ఎక్కువ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సాయం: భాజపా



మాట్లాడుతున్న రామ్మోహన్ గౌడ్

మనోహరాబాద్: భాజపా సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్, భాజపా జిల్లా నాయకులు చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తుందని సంగారెడ్డి జిల్లా భాజపా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు దూసుకెళుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయం అందిస్తోందన్నారు. సంగారెడ్డి జిల్లా భాజపా సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి లక్ష్మీనరసింహ, జేడీ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి రవిశంకర్, రామకృష్ణ, రజినీకాంత్, భాజపా మండలాధ్యక్షుడు విఠల్, శ్రవణ్‌కుమార్, సుభాష్ పాల్గొన్నారు.

తపస్ మండలాధ్యక్షుడిగా వెంకటేశ్

చేగుంట: చేగుంట మండల తపస్ అధ్యక్షుడిగా రావుల వెంకటేశ్ ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికయ్యారు. ఆదివారం చేగుంటలో తపస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా కృష్ణమూర్తి (కరీంనగర్), ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, అమరేశ్వరి, సంగీత, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా రాధ, సరస్వతి, శ్రీలత, రమేష్, సిద్దిరాములు, మంజులత, స్వరూపరాణి, కార్యవర్గ సభ్యులుగా వనిత, సంధ్యారాణి, మాధురి, నర్సింహారెడ్డి, రేవతి ఎన్నికయ్యారు.

సంతలో సమస్యల గోల

ఆదాయం ఇలా.. (రూ.లక్షల్లో)

సంవత్సరం	తైబజార్	పశువుల సంత	మేకల మార్కెట్
2022	9,56,100	7,10,100	15,16,000
2023	10,11,000	14,00,000	14,01,000
2024	11,00,000	12,50,000	15,32,000

న్యూస్‌టుడే, టేక్మాల్: సంతల వల్ల ప్రజలకు తక్కువ ధరకు కూరగాయలు, సరుకులు అందుబాటులో ఉంటున్నాయి. ప్రతి ఏటా వారాంతపు సంత ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం చేకూరుతున్న సంతల అభివృద్ధి చేయడంలో పాలకులు, అధికారులు శ్రద్ధ చూపడం లేదు. దీంతో కొనుగోలుకు వచ్చిన ప్రజలకు సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



షెడ్లు లేక నేలపై కూరగాయల విక్రయం

నేలపైనే విక్రయం

మండల కేంద్రం టేక్మాల్‌లో ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు సంతకు మంచి పేరు ఉంది. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి మేకలు, పశువులు, కూరగాయలు, దుస్తులు, పండ్లు తదితర వాటిని క్రయవిక్రయాలు నిర్వహిస్తుంటారు. సంతలో మూడు షెడ్లు మాత్రమే ఉన్నాయి. ఆసరాగా సరిపడా షెడ్లు లేక చెట్ల కింద, నేలపై, గొడుగులు పెట్టుకుని వ్యాపారస్తులు విక్రయం చేస్తున్నారు. వర్షాకాలంలో తడుస్తూ, ఎండాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల విక్రయానికి ఐదు గద్దెల నిర్మాణం చేపట్టిన వాటిపై షెడ్ల నిర్మాణం చేపట్టలేదు. సంతలో మినీ వాటర్ ట్యాంకు ఉన్నా వినియోగంలో లేదు. ప్రజల దప్పిక తీరాలంటే హోటళ్లను ఆశ్రయించక తప్పడం లేదు. పశువుల సంతలో మురుగు కాల్వలు లేక మురుగు సంతలోనే నిలుస్తుంది. పశువుల సంతలో నీడ లేక రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శౌచాలయం ఉన్నా నీటి వసతి లేక నిరుపయోగంగా ఉంది. పశువుల మార్కెట్‌లో రెండు నీటి తొట్లు ఉన్నప్పటికీ ఒకటి మాత్రమే వినియోగిస్తున్నారు.

బొడ్మట్‌పల్లిలో..

మండల పరిధి బొడ్మట్‌పల్లిలో ప్రతి మంగళవారం వారాంతపు సంత నిర్వహిస్తున్నారు. సంత ద్వారా ప్రతి ఏటా పంచాయతీకి రూ.1.50లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. సంతకు సొంత స్థలం లేకపోవడంతో మెదక్-బొడ్మట్‌పల్లి రోడ్డు, గ్రామంలోని సీసీ రోడ్డుపై సంత నిర్వహిస్తున్నారు. ఎల్లుపేటలో సోమవారం సంత నిర్వహిస్తున్నారు. సొంత ఉన్నా అభివృద్ధి చేయడం లేదు. షెడ్లు లేక చెట్ల కింద కూరగాయల విక్రయం కొనసాగుతుంది. తాగు నీటి ట్యాంక్, షెడ్ల నిర్మాణం చేసే సౌకర్యంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా శౌచాలయం

సంత అభివృద్ధి చేస్తాం

రియాజోద్దీన్, ఎంపీవో, టేక్మాల్

ఇటీవల టేక్మాల్‌లో నిర్వహించిన గ్రామసభలో నిర్వహించగా హాజరయ్యారు. గ్రామసభలో మార్కెట్ సమస్యలు మా దృష్టికి వచ్చాయి. సమస్యల పరిష్కారం చేలా కృషి చేస్తాం. బొడ్మట్‌పల్లిలో సంతకు సొంత స్థలం లేదు. వసతులు కల్పించడంతో సౌకర్యం కల్పిస్తాం.

న్యూస్‌టుడే, అల్లాదుర్గం: ? అల్లాదుర్గం మండలం నీలకంఠిపల్లి, అప్పాజీపల్లి గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలు పడి కంకర తేలి అధ్వానంగా ఉంది. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – మల్లయ్య, అప్పాజీపల్లి

✔ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. – విజయ్‌కుమార్, పీఆర్ ఏఈ, అల్లాదుర్గం

పైపులైన్లకు మరమ్మతులు

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని 10వ వార్డులో తవ్విన గుంత పూడ్చడం లేదని, తాగునీరు కలుషితమవుతోందని 'కలుషిత నీరు... జనం బేజారు' శీర్షికన 'ఈనాడు'లో గతనెల 28న వచ్చిన కథనానికి పుర అధికారులు స్పందించారు. శుక్రవారం పైప్‌లైన్లకు మరమ్మతులు చేయడంతోపాటు నీటి సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. పుర అధ్యక్షుడు అశోక్‌గౌడ్ పర్యవేక్షించారు.

ఈనాడు కథనాలకు స్పందన

మ్యాన్‌హోల్‌పై మూతలు ఏర్పాటు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: కాళ్లకల్ గానుగు బస్తీలో మ్యాన్‌హోల్ మూతలు ధ్వంసం కావడంతో 'ఈనాడు'లో శుక్రవారం 'అడ్డుగా రాళ్లు పెట్టినా ప్రమాదమే' శీర్షికన చిత్ర కథనం రావడంతో పంచాయతీ కార్యదర్శి గద్ద రాజు స్పందించారు. శుక్రవారం పంచాయతీ సిబ్బందితో కొత్త మూతలు ఏర్పాటు చేసి గుంతలు పూడ్చారు.

రేణుకా ఎల్లమ్మకు పూజలు

చేగుంట: మండల పరిధి కర్నాల్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని వివిధ మండలాలతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచి వందలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు.

పోచమ్మకు భక్తుల పూజలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన తునికి శివారు నల్ల పోచమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు జంటనగరాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు భక్తిశ్రద్ధల మధ్య బోనాలతో ఆలయం చుట్టూ ప్రదర్శనలను నిర్వహించి అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



పాపన్నపేటలో సేవకుల కవాతు



నర్సాపూర్‌లో..



రామాయంపేటలో పథ సంచాలన్

దేశసేవే ప్రధానం: ఆర్ఎస్ఎస్

నర్సాపూర్, పాపన్నపేట, తూప్రాన్, రామాయంపేట న్యూస్‌టుడే: దేశం కోసం పనిచేయాలంటే ఆర్ఎస్ఎస్‌తో కలిసి నడవాలని మెదక్ కార్యవహ్ బోల నాగభూషణం అన్నారు. ఆదివారం నర్సాపూర్‌లో స్వయం సేవకుల పద సంచలన కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రధాన వీధుల మీదుగా కవాతు నిర్వహించారు. వైద్య విధాన పరిషత్ రాష్ట్ర విశ్రాంత కమిషనర్ వీణాకుమారి, జిల్లా కార్యవహ ఓంకార్, నాయకులు నాగరాజు, అశోక్, సాయికిరణ్, బసప్ప, రమేష్, కౌన్సిలర్లు రాజేందర్, బుచ్చేశ్‌యాదవ్ తదితరులున్నారు. పాపన్నపేటలో సంఘ్ మెదక్ విభాగ్ ప్రచారక్ ప్రముఖ్ వెంకటేశ్వర్లు, సంఘ్ సేవకులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తూప్రాన్ ర్యాలీలో జిల్లా నాయకులు ఓంకార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు పాల్గొన్నారు. రామాయంపేటలో భరతమాత మందిరంలో సామాజిక సద్భావన సహ ప్రాంత ప్రముఖ్ చక్రవర్తుల రామకృష్ణ ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పతాకావిష్కరణ అనంతరం పురవీధుల్లో పథ సంచలన్ నిర్వహించారు. స్థానిక సంజీవని ఆసుపత్రి వైద్యుడు కమల్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణం.. వరండాలో భోజనం



మండలంలోని మంగళపర్తి ఉన్నత పాఠశాలలోని భోజనశాల నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. 104 మంది విద్యార్థులు చదువుతుండగా.. పాఠశాల వరండాలో భోజనాలు చేస్తున్నారు. గాలికి దుమ్ము, చెత్త ఎగిరి వచ్చి పళ్లాల్లో పడుతోందని వాపోతున్నారు. త్వరగా నిధులిచ్చి నిర్మాణం పూర్తి చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వెల్దుర్తి**

రహదారిపై గుంత..జర జాగ్రత్త



రహదారిపై గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి అధికారులు మాత్రం తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చేగుంట నుంచి గజ్వేల్‌కు వెళ్లే మార్గంలో 44వ జాతీయ రహదారి వంతెన వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఐదేళ్లుగా ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలికంగా మరమ్మతులు చేస్తూ వదిలేస్తున్నారే తప్ప శాశ్వతంగా బాగుచేయడం లేదు. అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, చేగుంట**



ఉద్యోగులు, విద్యార్థులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

కుమ్మరులు అన్ని రంగాల్లో రాణించాలి

పాపన్నపేట, న్యూస్‌టుడే: కుమ్మరి కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కుమ్మరుల ఉద్యోగం సంఘం జిల్లా నాయకుడు సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం ఏడుపాయల వద్ద కుమ్మర ఉద్యోగుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంఘం అంతా ఐక్యంగా ఉండి తమ ఉనికిని చాటాలన్నారు. ఉద్యోగాలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగాలకు ఎంపికైన వారిని, ఉత్తమ అవార్డు గ్రహీతలను, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని సన్మానించారు. నాయకులు రాములు, అంజయ్య, సత్యనారాయణ, లింగం తదితరులున్నారు.

ఘనంగా బోనాల సమర్పణ



కౌడిపల్లి, కొల్చారం, న్యూస్‌టుడే: కౌడిపల్లి మండలం మహ్మద్‌నగర్‌లో పోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ప్రధాన వీధుల మీదుగా ప్రదర్శన నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు శివసత్తుల పూనకాల మధ్య అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కొల్చారం మండలం రంగంపేటలో బోనాలు తీశారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు ఉచిత సెంటర్లు

గజ్వేల్, న్యూస్‌టుడే: పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకునేందుకు గజ్వేల్‌లో ఉచిత సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న ప్రసన్నహరికృష్ణ టీం సభ్యులు మల్లికార్జున్, సాదిక్ తెలిపారు. గజ్వేల్‌లోని అయ్యప్ప దేవాలయం ఎదురుగా ఉన్న విద్యార్థి బుక్‌డిపో, సంగాపూర్ రోడ్డులోని గ్లోబల్ కంప్యూటర్ సెంటర్, పెంటాచారీ ఆస్పత్రి సమీపంలోని వెంకటేశ్వర కమ్యునికేషన్ సెంటర్లలో ఉచితంగా ఓటును నమోదు చేసుకోవాలని వారు కోరారు.

బతుకమ్మ సంబురాలు..



దాండియా ఆడుతున్న మహిళలు, చిన్నారులు

చేగుంట, న్యూస్‌టుడే: మండల కేంద్రం చేగుంటలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన అయిత పరంజ్యోతి దాండియా, కోలాటం ఏర్పాటు చేయగా మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




కొర్విపల్లిలో మహాలక్ష్మీదేవి అవతారంలో..



వడియారంలో పూజలు చేస్తున్న దుర్గామాత భక్తులు



శివ్వంపేటలో..



మెదక్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అమ్మవారికి పుష్పార్చన

అమ్మ దర్శనం..భక్తుల తన్మయత్వం

దేవీ నవరాత్రి ఉత్సవాల భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేక రూపాల్లో అలంకరించారు. గ్రామ, పట్టణాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దశంకరంపేట గడికోటలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. తూప్రాన్ మండలం ఘనపురంలో భారాస నాయకుడు, గజ్వేల్ నియోజకవర్గ బాధ్యుడు వంటేరు ప్రతాపరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వెల్దుర్తి, చేగుంట, నార్సింగి, మనోహరాబాద్, చిన్నశంకరంపేట, శివ్వంపేట, అల్లాదుర్గం మండలాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. **- న్యూస్‌టుడే బృందం**

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. స్థానిక ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..శనివారం రాత్రి కౌడిపల్లి శివారులో ఎదురుగా ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మెదక్ మండలం పాతూర్ గ్రామానికి చెందిన ఆకుల రాజు(48) తీవ్రంగా గాయపడగా నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సూరారంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందారు. రాజుకు భార్య విమల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. నర్సాపూర్ నుంచి కౌడిపల్లి వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఆగి ఉన్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాలపై ఉన్న కంచన్‌పల్లికి చెందిన సిరినేని చందర్‌రావు, దేవులపల్లికి చెందిన పోచయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108-వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని స్థానిక ఏఎస్సై విఠల్ సందర్శించి వివరాలను నమోదు చేసుకున్నారు.

ఎంఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుక

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మైనంపల్లి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఛైర్మన్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అధ్యక్షతన సోమవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. ఇందుకు మెదక్ పట్టణ బాలుర జూనియర్ కళాశాల మైదానం వేదిక కానుంది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదివారం కళాశాల మైదానంలో ఏర్పాట్లు పరిశీలించారు. వేడుకలకు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, సీతక్క పాల్గొంటారని తెలిపారు.

ఆర్పీలకు అదనపు పనులు తగదు: సీఐటీయూ

గజ్వేల్: వేతనాలు అమలు చేయకుండా రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ)లతో అదనపు పనులు చేయించడం ప్రభుత్వానికి తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందెబోయిన ఎల్లయ్య అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఆర్పీలు చేపట్టిన నిరసనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. జీవో 60 ప్రకారం ఆర్పీలకు బీమా సౌకర్యంతోపాటు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు, సర్వే తదితర పనులకు ఆర్పీలను వినియోగిస్తూ పని ఒత్తిడి పెంచుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్పీలకు నెలకు రూ.19,500 వేతనం చెల్లించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. ఆర్పీల సంఘం గజ్వేల్ అధ్యక్షురాలు సుభద్ర, ఉపాధ్యక్షురాలు పద్మ, వరకుమారి, ప్రధాన కార్యదర్శి కల్పన, కోశాధికారి మనోహరి తదితరులు పాల్గొన్నారు.

సుహాసినిరెడ్డి నియామకంపై హర్షం

శివ్వంపేట: కాంగ్రెస్ నాయకురాలు చిలుముల సుహాసినిరెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంపై శివ్వంపేట మండల పార్టీ సీనియర్ నాయకులు నవీన్‌గుప్తా హర్షం వ్యక్తం చేశారు. నియామకంపై సీఎం రేవంత్‌రెడ్డి, సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావు, నియోజవర్గ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు భరోసా సీఎంఆర్ఎఫ్: ఎమ్మెల్యే

శివ్వంపేట, చిన్నశంకరంపేట, రామాయంపేట, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం సహాయనిధి దోహదం చేస్తుందని ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. పిల్లుట్ల గ్రామానికి చెందిన పి.మధుకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఎమ్మెల్యే ఆదివారం బాధితుడికి అందించారు.

- చిన్నశంకరంపేట మండలం శాలిపేటకు చెందిన లింగంకు మంజూరైన రూ.30వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకుడు పోశెటి అందించాడు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన బోడపట్ల పోచవ్వ కుటుంబానికి రూ.42వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దిరాములు అందించారు.

రోడ్లను అల్లుకున్న కొమ్మలు.. తరచూ ప్రమాదాలు

న్యూస్‌టుడే, వెల్దుర్తి, చిలప్‌చెడ్, శివ్వంపేట:

రహదారుల నిర్మాణంతో పాటు వాటి నిర్వహణ చాలా ముఖ్యం. రోడ్లు బాగుంటే ప్రయాణం సాఫీగా సాగుతుంది. ఇంత వరకు బాగానే ఉన్నా ఆయా మండలాల్లో రోడ్లు శిథిలం కావడంతో పాటు చెట్ల కొమ్మలు పెరిగి రోడ్లను ఆక్రమించడంతో తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందుకు కారణం రోడ్ల పక్కన క్రమపద్ధతిలో మొక్కలు నాటకపోవడం. ఈ మార్గాల్లో వాహనాలు ఎదురుగా వస్తే తొలగడానికి వీలులేక ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చెట్ల కొమ్మలను తొలగించాల్సిన ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి కొమ్మలను తొలగించక భారీగా పెరిగి దారులను కప్పేస్తున్నాయి. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



జగ్గంపేటలో దారిని కప్పేసిన చెట్ల కొమ్మలు

ఆయాచోట్ల పరిస్థితి..: వెల్దుర్తి ఉమ్మడి మండలంలో పలు రహదారుల్లో చెట్ల కొమ్మలతో కమ్ముకుని ఇబ్బందికరంగా తయారయ్యాయి. ముందే రోడ్లకు ఇరువైపులా స్థలాలను విడిచి మొక్కలు నాటకుండా తారు, కంకరకు దగ్గరగా నాటడంతో మొక్కలు పెరిగి భారీ వృక్షాలుగా ఎదిగి కొమ్మలు రోడ్లపైకి చేరి రాకపోకలకు ఆటంకంగా మారాయి. వెల్దుర్తి-మెదక్ ప్రధాన రోడ్డు 19 కి.మీ పొడవునా చెట్లు పెరిగి రోడ్డును పూర్తిగా ఆక్రమించాయి. ఉప్పులింగాపూర్, కొత్తపల్లి, శెట్టిపల్లికలాన్, బాలనగర్ తదితర ప్రాంతాల్లో చాలా ఇబ్బందిగా ఉంది. రెండేళ్ల క్రితం శెట్టిపల్లికలాన్ వద్ద ట్రాక్టర్‌ను దాటే క్రమంలో ద్విచక్ర వాహనం చెట్ల కొమ్మలు తగిలి అదుపుతప్పి పడిపోవడం పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. వెల్దుర్తి, ఎలుకపల్లి గ్రామాల మధ్య, చిన్నశంకరంపేట, దరిపల్లి నుంచి మాసాయిపేటకు రహదారి, శేరిల-పెద్దాపూర్, ధర్మారం-అందుగులపల్లికి రోడ్డును చెట్లు ఆక్రమించాయి. ఈ దారుల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

- శివ్వంపేట మండలం పిల్లుట్ల, రత్నాపూర్, అల్లీపూర్, గోమారం, కొంతాన్‌పల్లి, గుండ్లపల్లి, కొత్తపేట, బిజిలిపూర్, పాంబండ, తాళ్లపల్లి, బిక్య తండా తదితర రోడ్లలో చెట్ల కొమ్మలు అడ్డుగా మారాయి. చిలప్‌చెడ్ మండలం జగ్గంపేట, గౌతాపూర్, ఫైజాబాద్ తదితర గ్రామాల రహదారులు చెట్లకొమ్మలు ఆవరించి ప్రమాదకరంగా తయారయ్యాయి.



ఉప్పులింగాపూర్ శివారు వెల్దుర్తి-మెదక్ ప్రధాన దారి

పంచాయతీలదే బాధ్యత:

– పవన్, పీఆర్ ఏఈ, వెల్దుర్తి

ప్రస్తుతం గ్యాంగ్‌మెన్ వ్యవస్థ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో రోడ్లను ఆక్రమించిన చెట్ల కొమ్మలు తొలగించే బాధ్యత గ్రామ పంచాయతీలదే. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తమ గ్రామ పరిధి వరకు ఏ శాఖ రోడ్డు అనే తేడా లేకుండా అన్ని రోడ్లకు ఇబ్బంది మారిన చెట్లు, వాటి కొమ్మలను తొలగించాలి.

కూచారంలో స్వచ్ఛభారత్

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని కూచారంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో 306వ వారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని పోచమ్మ ఆలయ పరిసరాల్లో యువకులు పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మెదక్ పట్టణం పిట్లంబేస్‌కు చెందిన గోపాల్ కుటుంబ సభ్యులను నీలా సంస్థల ఛైర్మన్ మోహన్ నాయక్ పరామర్శించి రూ.5వేలు సాయం అందించారు.

ఎంఈవోకు సన్మానం

రామాయంపేట, న్యూస్‌టుడే: ఇటీవల నూతనంగా నియామకమైన నిజాంపేట మండలం ఎంఈవో యాదగిరిని రామాయంపేట వంజరి సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయనతోపాటు సంఘానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు నవాత్ ప్రమోద్, సంఘ సభ్యుడు రామును సన్మానించారు.